క్లుప్తంగా

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు



మల్లాపురంలోని పోలింగ్ కేంద్రంలో క్లయిమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

రాయదుర్గంటౌన్: రెండు రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నియోజకవర్గంలోని రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కోసం బీఎల్‌ఓలు క్లయిమ్‌లను స్వీకరించారు. తొలి రోజు శనివారం 196 క్లయిమ్‌లను స్వీకరించగా రెండో రోజు ఆదివారం 222 క్లయిమ్‌లను స్వీకరించినట్లు ఎన్నికల డీటీ సుజాత తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయా మండలాల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈడీటీ సుజాత మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో మరోసారి పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

కందికి తెగుళ్లతో రైతుల ఆందోళన



బ్రాహ్మణపల్లి వద్ద కందికి మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలో సాగు చేసిన కంది పంటకు తెగుళ్లు సోకి, రైతులు ఆందోళన చెందుతున్నారు. జల్లిపల్లి, కమ్మూరు, బ్రాహ్మణపల్లి, కొర్రకోడు, ఇప్పేరు, మరుట్ల, కలగళ్ల, కడదరకుంట, చోళసముద్రం, కరుట్లపల్లి, జయపురం, ఉదిరిపికొండ, గొటుకూరు, కూడేరు, ముద్దలాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఖరీఫ్‌లో వర్షాధారం కింద సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు కంది పంట సాగు చేశారు. పంట పూత దశకు వచ్చింది, కానీ పచ్చ పురుగు, లద్దె పురుగు ఆశించాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నా ఫలితంలేకపోతోంది. దీంతో కంది రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత బాగా పూస్తేనే దిగుబడి ఉంటుంది. తెగుళ్లతో పూత రాలిపోకుండా ఉండేందుకు తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు తగు సలహా సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి 13 వరకు మండల, గ్రామ స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాస్ నాయక్, ఈఓపీఆర్‌డీ దాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 12న అధికారులకు, 13న ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఉంటుందన్నారు.


ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి

కూడేరు: ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన కూడేరులో సీపీఐ నేతలతో కలసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న అన్ని గ్రామ సచివాలయాల్లో సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి మల్లికార్జున, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెరుగు సంగప్ప, నాయకులు సూర్య నారాయణ, మలరాయుడు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. కార్తీకమాసం కావడంతో స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయం..సేవలకు విఘ్నం



❑ ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న ఇతని పేరు మారెన్న. శెట్టూరు మండలం అనుంపల్లి గ్రామం. మండల కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉంటుంది. గతంలో ఇంటిముంగిటకే రేషన్, పింఛన్, ఇతర ప్రభుత్వ పథకాలన్నీ చేరేవి. అమ్మ ఒడి, రైతు భరోసా, ఇతర ఏ పథకం కోసం సమాచారం కావాలన్నా సచివాలయం వద్దకు వెళ్లేవాడు. పంట సాగు విత్తనాలు, ఎరువులు ఆర్బీకే వద్ద వెళ్లి తెచ్చుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి పనికీ శెట్టూరుకు వెళ్లాల్సి వస్తోందని, గత ప్రభుత్వం తరహాలోనే సచివాలయంలోనే సేవలు అందించాలని మారెన్న కోరుతున్నాడు.

- ప్రజా సమస్యలు కుప్పలు.. తప్పని ప్రదక్షిణలు
- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర
- పింఛన్ పంపిణీకే ఉద్యోగులను పరిమితం చేసిన వైనం
- స్థానికంగా సేవలందక అవస్థలు పడుతున్న ప్రజలు
- మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే



కైరేవు సచివాలయంలో ఖాళీగా కూర్చున్న సిబ్బంది

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల్లోనే పాలన, ప్రజల ముంగిటకే సేవలు అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారు. 2వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికీ సచివాలయం ఏర్పాటు చేశారు. వీటి ద్వారా స్థానికంగానే ఎక్కడికక్కడ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా సత్వర సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నారు. సత్వర సేవలకు విఘ్నం కలిగింది. కేవలం పింఛన్ల పంపిణీకి మాత్రమే ఉద్యోగులను పరిమితం చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 73 సచివాలయాలు, ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు పనిచేసే విధంగా గత ప్రభుత్వం నియమించింది. మొత్తం 630 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శితోపాటు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, వ్యవసాయ, వెటర్నరీ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రతి సచివాలయంలో 545 సర్వీసులకుపైగా ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు అందించి సచివాలయాల విషయంలో ప్రజల మన్ననలు పొందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉంటే చాలు..ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వర్తింపజేశారు. దీంతో అవినీతికి, దళారి వ్యవస్థకు తావులేకుండా పారదర్శక సేవలు అందించారు.

వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యం

ప్రతి గ్రామంలోనూ ప్రతి 50 ఇళ్లకు ఒక గ్రామ వలంటీర్ చొప్పున అప్పటి ప్రభుత్వం నియమించింది. వారి ద్వారానే ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి అందించేవారు. దీంతో ఎక్కడికక్కడ వలంటీర్లు ప్రజల నుంచి మన్ననలు పొందారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వలంటీర్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. దీంతో గ్రామాల్లో నిరుద్యోగిత పెరిగిపోయింది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదు. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు దాటినా నేటికీ కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు అందలేదు. సచివాలయ ఉద్యోగులపై గతంలో ఎన్నో విమర్శలు చేసిన కూటమి నేతలు.. నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కు అయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కాకుండా ప్రతి నెలా ఒకటోతేదీన పింఛన్ పంపిణీకి, 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమ పోస్టర్లు అతికించేందుకు మాత్రమే సచివాలయ ఉద్యోగులను వినియోగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్యాలయాలు వెలవెల..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో రూ.లక్షలు వెచ్చించి సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు నిర్మించింది. వాటి ద్వారానే ప్రతి పల్లెలోనూ సత్వరమే సేవలు అందేవి. నిత్యం ప్రజలు, ఉద్యోగులతో సచివాలయాలు, కార్యాలయాలు కళకళలాడేవి. అయితే నేడు కళ తప్పాయి. ప్రభుత్వ పథకాలు, సేవలకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు ఓపెన్‌కాక ఉద్యోగులు ఖాళీగా ఉంటున్నారు. కేవలం కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లు మాత్రమే జారీ చేస్తున్నారు.



గ్రామ సచివాలయంలో సేవలు అందించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

త్వరలోనే సచివాలయ సేవలు



ఇటీవల ప్రభుత్వం డీఎల్‌డీఓ, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలకు సచివాలయ సేవలపై శిక్షణ తరగతులు నిర్వహించింది. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, సదరం స్లాట్ బుకింగ్, కులం, ఆదాయ సర్టిఫికెట్ల జారీతో పాటు అన్ని సేవలూ సచివాలయంలోనే పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలోనే ప్రజలకు అవసరమైన అన్ని సేవలూ సచివాలయాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

లోక కల్యాణం కోసమే హోమాలు



మాట్లాడుతున్న కేరళ రాష్ట్ర మలయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి

బెళుగుప్ప: లోక కల్యాణం కోసమే హోమాలు, యాగాలు చేస్తున్నట్లు ప్రముఖ తాంత్రిక సంఖ్యామాన నిపుణులు, కేరళ రాష్ట్ర మలయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి పేర్కొన్నారు. ఆదివారం బెళుగుప్పలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు దైవచింతన శుభాన్ని కలగజేస్తుందన్నారు. డిసెంబర్ 13,14న దుబాయిలోని అబుదాబిలో అయ్యప్పస్వామి పడిపూజ, వచ్చే ఏడాది ఫిబ్రవరి 6న కర్ణాటకలోని బెంగళూరులో మహాకాళి యాగం, మేనెల 6న కొయంబత్తూరులో లక్ష్మీ కుబేరయాగం చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలు



ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలు చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలో విఘ్నేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలను కేరళ తాంత్రిక పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. అష్టద్రవ్య గణపతి హోమం, వాస్తు బలి, వాస్తు హోమాలు చేశారు. సోమవారం శివపూజ, మహాగణపతి, మృత్యుంజయ, లక్ష్మీవినాయక, మహాసుదర్శన హోమాలు నిర్వహించనున్నారు.

లత్తవరంలో కార్తీక వనభోజనాలు



ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేస్తున్న దృశ్యం



ఉమామహేశ్వర ఆశ్రమంలో వనభోజనాలు చేస్తున్న లత్తవరం గ్రామస్తులు

ఉరవకొండ: కార్తీక మాసం రెండో ఆదివారం పురస్కరించుకొని లత్తవరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఉమామహేశ్వర ఆశ్రమంలో ఆదివారం కార్తీక వన భోజనాలకు నిర్వహించారు. ఆశ్రమంలో శివాలయంలో విశేష పూజల అనంతరం నాగుల పుట్టలో పాలు పోసి మహిళలు పూజలు చేశారు. అనంతరం ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఉసిరి చెట్టు కింద ఆహ్లాదకర వాతావరణంలో వనభోజనాలు చేశారు.

విరబూసిన బ్రహ్మకమలాలు

ఉరవకొండ/బెళుగుప్ప: ఉరవకొండ మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ముత్తులూరి అశోక్, అనిత దంపతుల ఇంట్లో ఆదివారం బ్రహ్మకమలాలు విరబూశాయి. బెళుగుప్ప బీసీ కాలనీలో నివాసం ఉంటున్న సన్‌రైజస్ పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, నాగమణి దంపతుల ఇంట్లో శనివారం రాత్రి బ్రహ్మ కమళాలు విరబూసాయి. మూడేళ్ల క్రితం బ్రహ్మకమళం మొక్కను పెరట్లో నాటారు.



రాకెట్లలో విరబూసిన బ్రహ్మకమలం



బెళుగుప్పలో బ్రహ్మ కమళాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బాలుడి చికిత్సకు ఆర్థికసాయం

రాయదుర్గంటౌన్: ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న కాశీపురానికి చెందిన బాలుడు గౌతమ్‌కు రాయదుర్గం పోలీసులు చేయూతనందించారు. 'ఊపిరి నిలపండి..' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అర్బన్ సీఐ జయనాయక్, ఎస్ఐ బాలరాజు, పోలీసుల ద్వారా సేకరించిన విరాళాన్ని బాలుడి బంధువైన కొట్రేష్‌కు ఆదివారం అందజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



బోనాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని నిజవల్లి గ్రామంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది మంది మహిళలు బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండలం నుంచే గాక కర్ణాటక నుంచి వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అప్పాజిపాళ్యం, తమ్మయ్యదొడ్డి, బెస్తరపల్లి, మలయనూరు తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి నిర్వహించారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు జ్యోతులు, కలశాలను మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి చిత్ర పటం వద్ద సమర్పించారు. వాల్మీకి సంఘం నాయకులు తలారి గోవిందు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం వాల్మీకి చిత్ర పటంతో గ్రామోత్సవం నిర్వహించారు.

హామీలు నెరవేర్చేవరకూ పోరాడతాం



ఉరవకొండలో ప్రజాపోరు కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున

ఉరవకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు నెరవేర్చేవరకూ పోరాడతామని సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య తెలిపారు. ఆదివారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద సీపీఎం ప్రజాపోరు పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. సీపీఎం నాయకులు మధు, రంగారెడ్డి, జ్ఞానమూర్తి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరించి, ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.7 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైగింక దాడులను అరికట్టాలన్నారు. ఈనెల 14న అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు హామీలు నిలబెట్టుకోవాలి

ఉరవకొండ: ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జునతో ఐదు మండలాల కార్యదర్శులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఐదునెలలవుతున్నా పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంపై నోరు మెదపడంలేదన్నారు. ఈనెల 18న జరిగే ధర్నాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుల్తాన్, చంద్రాయుడు, గన్నేమల్లేష్, పురిడి తిప్పయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరగనున్న ప్రజాపోరు ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంచారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, పట్టణ కార్యదర్శి రఘు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు సిద్దప్ప, అశోక్, రాము, బాషా, శ్రీనివాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వజ్రకరూరు: మండల కేంద్రానికి చెందిన ఆవుల కురుబ నాగరాజు అనే వ్యక్తి కనిపించలేదని అతని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈనెల 7న నాగరాజు ఇంటినుంచి వెళ్లాడని, తిరిగి రాలేదని ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

చిరుత దాడిలో గేదె మృతి

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి గ్రామ శివారులో రామాంజనేయులు అనే రైతుకు చెందిన గేదెపై ఆదివారం తెల్లవారుజామున చిరుత దాడి చేసింది. అటవీ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్పకు బాధిత రైతు ఈరన్న ఫిర్యాదు చేశాడు. వారు క్షేత్రస్థాయికి చేరుకొని పంచనామా చేశారు. శని, ఆదివారం రెండు గేదెలపై చిరుత దాడి చేసినట్లు తెలిపారు.

అ 'పూర్వ' సమ్మేళనం

కూడేరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.



సమ్మేళనమైన 1990-91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

వివాహిత ఆత్మహత్యాయత్నం

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం మురడికి చెందిన శైలజ (23) ఆదివారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన గంగాధర్‌కు విడపనకల్లు మండలం గాజుల మల్లాపురానికి చెందిన మౌనిక (శైలజ అక్క)తో వివాహమైంది. అయితే సోదరి భర్తతో శైలజ ప్రేమాయనం సాగించి, ఏడాది క్రితం రెండో వివాహం చేసుకుంది. మురడిలోనే కాపురం పెట్టింది. సోదరితోపాటు తల్లిదండ్రులను కూడా బాధపెట్టానని మనోవేదనతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డిలో రోడ్డు ప్రమాదంలో భూతయ్య అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన భూతయ్య నడిచి వెళ్తుండగా వెనుకవైపు నుంచి ద్విచక్రవాహనం ఢీకొనింది. దీంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నేడు మాజీ ఎంపీ తలారి రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: అనంతపురం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈమేరకు పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు శెట్టూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ ధ్వజ, కలశ నాగ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కరిడిపల్లిలో మహర్షి వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠాపనలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కుందుర్పి మండలం ఎస్.మల్లాపురంలో పార్టీ కార్యకర్త పెద్ద మల్లప్పను పరామర్శించనున్నారు. పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యంబాబు



కంబదూరు: గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా కంబదూరు గ్రంథాలయాధికారి హెచ్.సత్యంబాబు ఎన్నికయ్యారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కోళ్లపల్లి మధుసూదనరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవం చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సత్యంబాబు, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జయరాములు, ట్రెజరర్‌గా రామాంజినమ్మ, సహాయ కార్యదర్శిగా నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, కమ్మన్న, వెంకటేశ్వర్లు,ఎర్రిస్వామి, రాములు ఎన్నికయ్యారన్నారు.

టమాట రైతులకు వాతావరణ బీమా

కంబదూరు: రబీలో టమాటా సాగు చేసిన రైతులకు వాతావరణ బీమా వర్తిస్తుందని మండల ఉద్యాన అధికారి గౌసియా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టమాటా పంట సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదుతో పాటు డిసెంబర్ 15లోపు ఎకరాకు రూ.1600 ప్రకారం ప్రీమియం చెల్లిస్తే పంట నష్టం జరిగినప్పుడు రూ.32 వేల బీమా పొందొచ్చన్నారు. టమాట పంట సాగుకు బ్యాంకులో రుణం తీసుకునే రైతులు ఆయా బ్యాంక్‌ల్లో ప్రీమియం చెల్లించాలని, పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతు సేవా కేంద్రాల్లో భూమికి సంబంధించిన 1బీ, రైతు ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలను అందజేసి, ప్రీమియం చెల్లించొచ్చన్నారు. పూర్తి వివరాలకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణసాగర్ సెల్: 9912275799కు సంప్రదించాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు అన్నారు. ఆదివారం మండలంలోని నేమకల్లు, బండూరు, ఉద్దేహాళ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కొత్త ఓటర్ల నమోదు సవరణ దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని తెలియజేశారు. మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక ఓటరు నమోదుకు- 69, తప్పుఒప్పులు - 29, మరణించిన వారి కోసం 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి



ఆత్మకూరువీధిలో టిప్పుసుల్తాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో షహీద్ హజ్రత్ టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. రాయదుర్గం మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ టిప్పు సుల్తాన్ చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఖాజీ మహమ్మద్ సైఫుల్లా ఫాతేహా పఠనం చేసి దేశ భద్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు అబ్దుల్ హమీద్, సిద్దిక్, దాదాపీర్, ఫారూఖ్, అల్లాబకాష్, మహమ్మద్, ముస్తఫా, అతిఖ్ పాల్గొన్నారు.